


మాటంటే మాటే..!

చంద్రబాబు రాగానే హంద్రీనీవా పనులు పరుగు





సీఎం పర్యటనపై అధికారులతో చర్చిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

పయ్యావుల బడ్జెట్‌లో భారీగా నిధుల కేటాయింపు

నేడు ఛాయాపురానికి సీఎం..

విస్తరణ పనుల పరిశీలన

అనంతపురం, మే 8(ఆంధ్రజ్యోతి): రాయలసీమ ప్రజల జీవనాడి హంద్రీనీవా. కరువు జిల్లా అనంతకు వరం. అలాంటి ప్రాజెక్టును వైసీపీ పాలకులు పూర్తి స్థాయిలో నిర్లక్ష్యం చేశారు. కాలువలో గంపెడు మట్టి తీసిన పాపానపోలేదు. రాష్ట్ర విభజన తరువాత 2014-19 మధ్య సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం హంద్రీనీవా కోసం రూ.4వేల కోట్లకుపైగానే ఖర్చు చేసింది. వైసీపీ ఐదేళ్ల పాలనలో హంద్రీనీవా ప్రాజెక్టుపై విషం చిమ్మినా, చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రాగానే హంద్రీనీవా ప్రాజెక్టు పనులు ఊపందుకున్నాయి. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు పనులను పరుగులు పెట్టిస్తున్నారు. బడ్జెట్‌లోనూ పెద్ద ఎత్తున నిధులు కేటాయించారు. అన్నదాతల కలలను సాకారంచేసే దిశగా సీఎం చంద్రబాబు ముందుకు సాగుతున్నారు.

తొలగిన గ్రహణం

వైసీపీ ఐదేళ్ల పాలనలో నిర్లక్ష్యానికి గురైన హంద్రీనీవాకు చంద్రబాబు పాలనలో గ్రహణం వీడింది. కాలువ విస్తరణ పనులు ఊపందుకున్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి పనులు పూర్తి చేసేలా ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు సమన్వయంతో పనిచేస్తున్నారు. ఫేజ్-2 కింద 88 కి.మీ. విస్తరణ పనులకు రూ.439 కోట్లు, 216 కి.మీ. నుంచి 400 కి.మీ. వరకు 184 కి.మీ. లైనింగ్‌కు రూ.937 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. విస్తరణ, లైనింగ్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. సకాలంలో పనులను పూర్తి చేసి, వచ్చే సీజన్ నాటికి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వ యంత్రాంగం కృషి చేస్తోంది. దీంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. విస్తరణ, లైనింగ్ పనులు పూర్తైతే కాలువ ప్రవాహ సామర్థ్యం 2 వేల క్యూసెక్కుల నుంచి 3850 క్యూసెక్కులకు పెరుగుతుంది. 84.97 లక్షల క్యూబిక్ మీటర్ల పనులకుగాను ఇప్పటి వరకు 63 లక్షల క్యూబిక్ మీటర్ల పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు ఈ ఏడాది జూన్ చివరినాటికి పూర్తి చేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. భారీ అధునాతన యంత్రాలను వినియోగించి పనుల్లో వేగం పెంచారు. ఈ పనులు పూర్తైతే ఉమ్మడి జిల్లాలో 1.98 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది.

మంత్రి, ప్రజాప్రతినిధుల చొరవ

సీఎం చంద్రబాబు జిల్లాపై ప్రత్యేక అభిమానాన్ని చాటుకునేలా హంద్రీనీవా ప్రాజెక్టు పూర్తికి కంకణబద్ధులయ్యారు. ఉరవకొండ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న పయ్యావుల కేశవ్, ఆర్థిక శాఖ మంత్రి కావడంతో బడ్జెట్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా నిధులు కేటాయించేలా చేశారు. జిల్లా ప్రజాప్రతినిధుల చొరవతో ఇది సాధ్యమైంది. వైసీపీ పాలనలో ఆ పార్టీ ప్రజాప్రతినిధులు హంద్రీనీవా గురించి అప్పటి సీఎం జగన్‌తో మాట్లాడే పరిస్థితే లేకపోయింది. 2019కి ముందు ప్రతిపక్ష నేతగా, అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి హోదాలోనూ ఉమ్మడి జిల్లాకు జగన్ అనేక హామీలిచ్చారు. హంద్రీనీవా కాలువను విస్తరించి, లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తానని మాటలు చెప్పారు. కానీ ఐదేళ్లలో గంపెడు మట్టినీ తీయలేదు.

సీఎం పర్యటన ఇలా..

సీఎం చంద్రబాబు వజ్రకరూరు మండలం ఛాయాపురం సమీపంలోని హంద్రీనీవా కాలువ విస్తరణ, లైనింగ్ పనులను శుక్రవారం క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తారు. ఆ పనులను స్వయంగా పర్యవేక్షించేందుకే ముఖ్యమంత్రి ప్రత్యేకంగా జిల్లాకు వస్తున్నారు.

- ఉండవల్లిలోని తన నివాసం నుంచి శుక్రవారం ఉదయం 10 గంటలకు బయలుదేరి 10.35 గంటలకు విజయవాడ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- అక్కడి నుంచి విమానంలో 10.40 గంటలకు బయల్దేరి శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి ఎయిర్‌పోర్టుకు 11.20కి చేరుకుంటారు.
- 11.30 గంటలకు పుట్టపర్తి ఎయిర్‌పోర్టు నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 12.00 గంటలకు ఛాయాపురం హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- పది నిమిషాలపాటు అధికారులు, ప్రజాప్రతినిధుల నుంచి స్వాగతం స్వీకరించి 12.15 గంటలకు హంద్రీనీవా కాలువ వద్దకు చేరుకుంటారు. 12.45 వరకు పనులను పరిశీలిస్తారు.
- ఛాయాపురంలోని ప్రజావేదిక వద్దకు 12.50కి చేరుకుంటారు. మధ్యాహ్నం 1.30 వరకు విశ్రాంతి తీసుకుంటారు.
- 2 గంటల నుంచి 3.30 వరకు ఛాయాపురం ప్రజలతో ముఖాముఖి.
- హెలిప్యాడ్ నుంచి 3.45కి బయల్దేరి 4.15కి పుట్టపర్తి చేరుకుంటారు.
- 4.25కి హైదరాబాద్‌కు బయల్దేరతారు.

నిలకడగా చీనీ ధరలు



అనంతపురం రూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో చీనీ ధరలు నిలకడగా ఉంటున్నాయి. టన్ను ధర కొన్ని రోజులుగా రూ.20వేల నుంచి రూ.22వేల మధ్య పలుకుతున్నాయి. మూడు నాలుగు రోజులుగా టన్ను రూ.24వేలకుపైగా గరిష్ఠ ధరలు పలుకుతున్నాయి. గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.24వేలు, కనిష్ఠంగా రూ.3,100, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు.

అనంతకు 100 టీఎంసీల నీరు తేవడమే లక్ష్యం

ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్

11 మందికి రూ.13.32 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



బాధితులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, మే 8(ఆంధ్రజ్యోతి): అనంతకు 100 టీఎంసీల నీరు తీసుకురావడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో 11 మంది బాధితులకు రూ.13.32 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనంతపురం అర్బన్ పరిధిలో ఎన్నడూలేనివిధంగా గత 11 నెలల్లో రూ.కోటిన్నర సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశామన్నారు. సీఎం చంద్రబాబు పేదల ఆరోగ్యం విషయంపై ఉదారంగా సాయం అందిస్తున్నారన్నారు. గతంలో శ్రీశైలం నుంచి 50 టీఎంసీల నీరు వచ్చేదనీ, ఇప్పుడు 100 టీఎంసీలు తీసుకువచ్చేందుకు హంద్రీనీవా కాలువను వెడల్పు చేస్తున్నారన్నారు. జీడిపల్లి నుంచి లైనింగ్ చేస్తూ అన్ని ప్రాంతాలకు నీరు అందేలా చూస్తున్నామన్నారు. వైసీపీ హయాంలో గంపెడు మట్టిని కూడా తీయలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భవాని రవికుమార్, టీడీపీ నాయకులు సరిపూటి రమణ, బాలాంజనేయులు, పోతుల లక్ష్మీనరసింహులు, పరమేశ్వరన్, కడియాల కొండన్న, సరళ, రాయల్ మధు, గోపాల్ గౌడ్, నారాయణస్వామి యాదవ్, ఫిరోజ్ అహ్మద్, సిరిశాల రాంబాబు, జేఎం బాషా పాల్గొన్నారు.

గుంతకల్లుకు సాగు నీరివ్వండి..! సీఎం చంద్రబాబుకు లేఖ..
సీఎం పర్యటనను విజయవంతం చేయాలి కలెక్టర్ వినోద్‌కుమార్
సీఎం పర్యటనకు పటిష్ఠ భద్రత శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ రత్న
6



బ్రహ్మోత్సవ శోభ

నేటి నుంచి పెన్నహోబిలేశుడి వేడుకలు

ఉరవకొండ, మే 8(ఆంధ్రజ్యోతి): పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకూ జరగనున్నాయి. ఆమిద్యాల నుంచి ఉత్సవమూర్తులను పెన్నహోబిలానికి తీసుకురావడంతో బ్రహ్మోత్సవాలు మొదలవుతాయి. ఈ నెల 10వ తేదీ ధ్వజారోహణం, రాత్రి ప్రాకారోత్సవం, 11న సింహవాహనోత్సవం, రాత్రి చంద్రప్రభ వాహనోత్సవం నిర్వహిస్తారు. 12న గోవాహనోత్సవం, శేషవాహనోత్సవం, 13న హంస వాహనోత్సవం, 14న హనుమంత వాహనోత్సవం, 15న గరుడ వాహనోత్సవం, కల్యాణోత్సవం నిర్వహిస్తారు. 16న సూర్యప్రభ, ఐరావత వాహనోత్సవం, 17న ఉదయం మడుగుతేరు, సాయంత్రం బ్రహ్మరథోత్సవం నిర్వహిస్తారు. 18న అశ్వ వాహనోత్సవం, 19న ధ్వజావరోహణం, శయనోత్సవం నిర్వహిస్తారు. 20న ఉత్సవ విగ్రహాలను పెన్నహోబిలం నుంచి ఆమిద్యాలకు తరలిస్తారు. అంతటితో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. బహ్మోత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని ఈవో రమేష్ తెలిపారు. పాత రథానికి మరమ్మతు చేయించామని తెలిపారు.



ఆలయం ఎదుట ఉగ్ర నారసింహుడు

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ చేయిస్తా: కేఏ పాల్

అనంతపురం సెంట్రల్, మే 8(ఆంధ్రజ్యోతి): రాయలసీమ ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందిస్తున్న ఆర్డీటీ సంస్థకు ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ (ఎఫ్‌సీఆర్ఏ) రెన్యువల్ చేయిస్తానని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్ అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్జీఓ సంస్థలకు విదేశాలనుంచి నుంచే వచ్చే రూ.57వేల కోట్ల విరాళాలను ఆపేస్తే.. తిరిగి అనుమతులిప్పించామని అన్నారు. ఎన్నో సంస్థలకు తానే ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ చేయించానని, ఆర్డీటీకి కూడా రెన్యువల్ చేయిస్తానని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి తన ఆశీస్సులు పొందనందుకే గత ఎన్నికల్లో ఓడిపోయారని అన్నారు.



రైతుల సహకారంతోనే పారిశ్రామికాభివృద్ధి

ఎమ్మెల్యే పరిటాల సునీత..

దాదులూరు వద్ద ఎంఎస్ఎంఈ పార్కుకు భూమిపూజ



దాదులూరు వద్ద ఎంఎస్ఎంఈ పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కనగానపల్లి, మే 8(ఆంధ్రజ్యోతి): రైతులు సహకారం అందిస్తేనే పారిశ్రామికాభివృద్ధి సాధ్యమని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. మండలంలోని దాదులూరు వద్ద సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) పార్కుకు గురువారం ఆమె భూమిపూజ చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ.. పరిశ్రమల ఏర్పాటు ద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారన్నారు. దాదులూరు వద్ద టీడీపీ హయాంలో నిర్మించిన గోరుచిక్కుడు గోడౌన్.. గత వైసీపీ పాలకుల అలసత్వం కారణంగా నిరుపయోగంగా మారిందన్నారు. రైతులు, ప్రజలు సహకారం అందిస్తే దాదులూరు ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం టీడీపీ ధర్మవరం ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ.. కొత్త ఆలోచనలు, టెక్నాలజీతో యువత ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ధర్మవరం ఆర్డీఓ మహేష్, ఏపీఐఐసీ జెడ్ఎం సోనీ, డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్, మార్కెట్ యార్డు చైర్మన్ సుధాకర్ చౌదరి, కన్వీనర్ యాతం పోతులయ్య పాల్గొన్నారు.



కార్మికుల ఆకలి కేకలు వినబడవా?

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు



ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయం ఎదుట బైఠాయించి ప్లేట్లు కొడుతూ నిరసన తెలుపుతున్న శ్రీరామిరెడ్డి తాగునీటి కార్మికులు, ఓబులు

కళ్యాణదుర్గం రూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు 34 రోజులుగా సమ్మె చేస్తున్నారని, వారి ఆకలి కేకలు ప్రజాప్రతినిధులు, అధికారులకు వినబడవా అని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు ప్రశ్నించారు. పంప్ హౌస్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు కార్మికులు ప్లేట్లను కొడుతూ గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయం వద్దకు వెళ్లి బైఠాయించారు. జీతాలు ఇవ్వకుంటే ఎలా బతకాలని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరు నెలల వేతనాలను బకాయి పెట్టారని, 60 నెలల ఈపీఎఫ్ చెల్లించలేదని అన్నారు. శ్రీరామిరెడ్డి పథకం కింద 600 మంది కార్మికులు పనిచేస్తున్నామని, 950 గ్రామాలకు తాగునీటిని అందిస్తున్నామని అన్నారు. జిల్లా పర్యటనకు వస్తున్న సీఎం చంద్రబాబును కార్మికులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి కష్టాలను తెలియజేస్తామని ఓబులు అన్నారు. ఆందోళనలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రాయలసీమ ద్రోహి.. జగన్

ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ కేశవరెడ్డి



మాట్లాడుతున్న కేశవరెడ్డి, ఆలం, రామలింగారెడ్డి

బుక్కరాయసముద్రం, మే 8(ఆంధ్రజ్యోతి): రాయలసీమ ద్రోహి వైఎస్ జగన్ రెడ్డి అని ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ కేశవరెడ్డి విమర్శించారు. హంద్రీనీవాపై వైసీపీ నేతల ఆరోపణలపై టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డితో కలిసి ఆయన గురువారం పార్టీ స్థానిక కార్యాలయంలో మాట్లాడారు. కరువు సీమకు హంద్రీనీవా ఓ వరం అన్నారు. వైసీపీ హయాంలో గుంపెడు మట్టి కూడా తీయకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడగానే ముఖ్యమంత్రి చంద్రబాబు హంద్రీనీవా విస్తరణ, లైనింగ్ పనులు చేపట్టారన్నారు. హంద్రీనీవా పనులు పూర్తి చేసి, రికార్డు సృష్టిస్తామన్నారు. హంద్రీనీవా కాలువ పరిధిలోని అన్ని చెరువులు నింపి, రైతులను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందులో భాగంగానే సీఎం చంద్రబాబు శుక్రవారం జిల్లాకు రానున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ అశోక్, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

హంద్రీనీవా లైనింగ్ పనులు ఆపాలి

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు

ఉరవకొండ, మే 8(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు ఆపి, ఆయకట్టుకు సాగునీరు అందించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని దేవాంగ కల్యాణమండపంలో గురువారం ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కాలువలో 10వేల క్యూసెక్కులు పారిస్తామన్న హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. డిస్ట్రిబ్యూటరీ పనులు పూర్తి చేసి, నీరు ఇచ్చినప్పుడే రైతులకు మేలు చేకూరుతుందన్నారు. కాలువ లైనింగ్ పనులతో రైతులకు ఒరిగేదేమీ లేదన్నారు. రెండో దశలో లైనింగ్ పనులు ఆపాలని డిమాండ్ చేశారు. లేదంటే అడ్డుకుంటాము కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. మిర్చి పంట గిట్టుబాటు ధరలేక రైతులు నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి, కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బ్యాళ్ల ప్రసాద్, శీనా, అబ్బాస్, రమేష్ పాల్గొన్నారు.

ఆ జీఓ రద్దు చేయాలి

హంద్రీనీవా ప్రాజెక్టు ప్రయోజనాలను కుదించే జీఓ 404, 405లను రద్దు చేయాలని రైతు, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో జీవో ప్రతులను చూపుతూ నిరసన తెలిపారు. హంద్రీనీవా ప్రాజెక్టు కాలువను మల్యాల నుంచి జీడిపల్లి వరకు 3,850 క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేయాలన్నారు. ప్రధాన కాలువ లైనింగ్ పనులు వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు, ప్రజాసంఘాల నాయకులు మధుసూదన్, కృష్ణమూర్తి, బాలరంగయ్య, రంగారెడ్డి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఎఫ్‌పీఓలకు నాఫెడ్ పురస్కారాలు



నాఫెడ్ ఎండీ నుంచి అవార్డు అందుకుంటున్న బత్తలపల్లి రైతు, ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్ కరుణాకర్‌రెడ్డి, సీఈఓ పవన్

అనంతపురం అర్బన్, మే 8(ఆంధ్రజ్యోతి): ముదిగుబ్బ, బత్తలపల్లి రైతు ఉత్పత్తిదారుల సంఘాల డైరెక్టర్, సీఈఓలకు నాఫెడ్ ఎండీ దీపక్ అగర్వాల్ ఉత్తమ పుర స్కారాలను గురువారం ప్రదానం చేశారు. ఢిల్లీలోని నాఫెడ్ ప్రధాన కార్యాలయంలో ముదిగుబ్బ రైతు ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్ ఆవుల చంద్రమోహన్, సీఈఓ సతీష్, బత్తలపల్లి రైతు ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్ కరుణాకర్‌రెడ్డి, సీఈఓ పవన్‌కు నాఫెడ్ ఎండీ దీపక్ అగర్వాల్ ప్రశంసా పత్రం, జ్ఞాపికలు అందజేశారు. ఎఫ్‌పీఓ నిర్వహణ, వ్యాపార లావాదేవీలు, ప్రభుత్వ, ఇతర సంస్థలతో అనుసంధానం తదితర అంశాల్లో ప్రగతి సాధించినందుకు ఈ పురస్కారాలను అందజేశారు. ఈ ఎఫ్‌పీఓలు ఎరువులు, పురుగు మందులు డీలర్‌షిప్ తీసుకుని, సరసమైన ధరలకు రైతులకు అందజేశాయి. గత ఏడాది ముదిగుబ్బ ఎఫ్‌పీఓ రూ.5 కోట్లు, బత్తలపల్లి ఎఫ్‌పీఓ రూ.8 కోట్లు వ్యాపార లావాదేవీలు జరిపాయి. నాఫెడ్ ద్వారా దేశ వ్యాప్తంగా 1280 ఎఫ్‌పీఓలు ఉండగా.. పురస్కారాలను దక్షిణ భారతదేశంలో 12 సంఘాలలో శ్రీసత్యసాయి జిల్లా నుంచి రెండు ఉండటం విశేషం. డైరెక్టర్లు, సీఈఓలకు జేడీ భారత్ టీం లీడర్ రామాంజులు, అధికారులు, రైతులు శుభాకాంక్షలు తెలియజేశారు.



నాఫెడ్ ఎండీ నుంచి అవార్డు అందుకుంటున్న ముదిగుబ్బ రైతు ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్ ఆవుల చంద్రమోహన్, సీఈఓ సతీష్



గాయపడిన వారిని స్ట్రెచర్‌పై ఇలా తరలిస్తాము..



బిల్డింగ్‌పై గాయపడి నడవలేని స్థితిలో ఉన్నవారిని తాడు సాయంతో కిందకు దించే ప్రక్రియ

యుద్ధం.. భద్రం..!

స్వీయరక్షణ, సహాయక చర్యలపై మాక్ డ్రిల్

ఆర్టీసీ బస్టాండులో నిర్వహించిన అధికారులు

అనంతపురం క్రైం/కల్చరల్, మే 8(ఆంధ్రజ్యోతి): యుద్ధవాతావరణం నేపథ్యంలో భద్రత పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు వివిధ శాఖల అధికారులు చర్యలు చేపట్టారు. అనంతపురం బస్టాండులో గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. డీఆర్వో మలోల, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి శ్రీనివాస రెడ్డి ప్రజలకు అవగాహన కల్పించారు. యుద్ధ ప్రభావిత ప్రాంతాల జాబితాలో జిల్లా లేనప్పటికీ అంతర్గత భద్రత అవసరమని డీఆర్వో అన్నారు. యుద్ధ ప్రభావం ఈ ప్రాంతంపై పడితే ప్రభుత్వం ముందస్తుగా సైరన్ మోగిస్తుందని, ప్రజలు అప్రమత్తమై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శత్రుదేశాలవారు ప్రజల్లో కలిసిపోయి బాంబులు పెట్టే ప్రమాదం ఉందని, అనుమానాస్పదంగా ఏవైనా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రమాద సమయంలో స్వీయ భద్రతను పాటిస్తూనే తోటివారికి సాయపడాలని డీఎఫ్‌ఓ సూచించారు. పోలీసు, అగ్నిమాపక శాఖ, వైద్య శాఖ ఎమర్జెన్సీ టోల్ ఫ్రీ నంబర్లను ప్రతి ఒక్కరూ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. సోషల్ మీడియాలో పోస్టులను వెంటనే నమ్మకుండా, వాస్తవాలను తెలుసుకుని స్పందించాలని అన్నారు. ఆలయాలు, బస్టాండు, రైల్వే స్టేషన్ వంటి రద్దీ ప్రాంతాల్లో ఏవైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం చేరవేయాలని సూచించారు. అనంతరం రెవెన్యూ, అగ్నిమాపక, పోలీసు, వైద్యశాఖ సిబ్బంది సంయుక్తంగా మాక్ డ్రిల్ నిర్వహించారు. ఆపద సమయంలో ఎలా వ్యవహరించాలో చేసి చూపించారు. మాక్‌డ్రిల్‌ను ప్రజలు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో ఏడీఎఫ్‌ఓ కేవీ లింగమయ్య, నాలుగో పట్టణ సీఐ సాయినాథ్, 108 జిల్లా మేనేజర్ తిరుపతి నాయుడు, ఆర్టీసీ డిప్యూటీ సీటీఎం శ్రీలక్ష్మి, డీఎం నాగభూపాల్, బస్టాండు మేనేజర్ కేవీఎస్ మూర్తి, ఎస్‌టీఐ రామాంజనేయులు పాల్గొన్నారు.

గుంతకల్లుకు సాగు నీరివ్వండి..!

సీఎం చంద్రబాబుకు రైతుల వినతి

గుంతకల్లు, మే 8(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కింద గుంతకల్లు నియోజకవర్గానికి అధికారికంగా ఆయకట్టును కేటాయించాలంటూ స్థానిక రైతులు కోరుతున్నారు. హంద్రీనీవా కాలువ జిల్లాలోకి ప్రవేశించేది గుంతకల్లు మండలంలోనే. అయినా, గుంతకల్లు నియోజకవర్గానికి ఆ ప్రాజెక్టు కింద ఆయకట్టే కేటాయించలేదని వారు వాపోతున్నారు. కళ్లెదుటే కాలువ నిండా నీరు వెళ్తున్నా, గుంతకల్లు నియోజకవర్గంలో ఒక ఎకరాకూ అధికారికంగా నీటిని వాడుకునే వీలు కల్పించలేదని స్థానిక రైతులు వాపోతున్నారు. జిల్లాలో ఉరవకొండ నియోజకవర్గంలో ఛాయాపురం వద్ద హంద్రీనీవా సందర్శనకు వస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఇక్కడి రైతులు ఆయకట్టు విషయంగా వేడుకుంటున్నారు. గుంతకల్లు, గుత్తి మండలాలకు అధికారికంగా ఒక్క ఎకరాకూ ఏ ప్రాజెక్టు నుంచీ సాగునీరందడం లేదు. హంద్రీనీవా కాలువను ప్రారంభించేటప్పుడు 2013లో కాంగ్రెస్ హయాంలో నియోజకవర్గానికి ఆయకట్టు కేటాయించకపోవడంతో అన్యాయం జరిగిందని, కనీసం హంద్రీనీవాను వెడల్పు చేస్తున్న సందర్భంగానైనా అధికారికంగా నీటి కేటాయింపు జరగాలని రైతులు కోరుకుంటున్నారు.

రెండు ప్రాజెక్టులున్నా..

గుంతకల్లు నియోజకవర్గంలో రెండు ప్రధాన సాగునీటి ప్రాజెక్టులు హంద్రీనీవా, గుత్తి సబ్‌బ్రాంచ్ కెనాల్ (జీబీఎస్‌సీ) ఉన్నా రైతులకు ఒరిగింది శూన్యం. జీబీఎస్‌సీ కింద 16,271 ఎకరాల అధికారిక ఆయకట్టు ఉన్నా జీబీసీ నుంచి పుష్కలంగా ఈ ప్రాజెక్టులోకి రావడంలేదు. హెచ్చెల్సీ నుంచి జీబీసీకి తక్కువ నీటి కోటా వస్తుండటంతో 15 ఏళ్లుగా గుత్తి, ఆలూరు బ్రాంచ్ కాలువలకు సాగునీరు రావడం నిలిచిపోయింది. 2013లో హంద్రీనీవా ప్రారంభం ఆయాక అనధికారికంగా ఈ బ్రాంచ్ కాలువలకు కొద్దిపాటి నీటిని విడుదల చేస్తున్నారు. హంద్రీనీవా నుంచి కూడా గుంతకల్లు నియోజకవర్గంలో ఎకరా ఆయకట్టు కూడా లభించకపోవడంతో రైతులు నిరాశకు లోనయ్యారు. కాలువ వెడల్పు, లైనింగ్ జరిగిందంటే టెయిల్ ఎండ్‌కు నీరు తీసుకెళ్లడానికి అంటూ హంద్రీనీవా నీటిని జీబీసీకి వదలకుండా మొండి చేయి చూపుతారంటూ అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఆ రెండింటికీ గ్రీన్ సిగ్నల్ కావాలి

వజ్రకరూరు మండలం రాగులపాడు వద్ద నుంచి తూముల ఏర్పాటుచేసి గుంతకల్లు మండలంలోని 12 చెరువులకు నీరందించే ప్రాజెక్టును వెంటనే చేపట్టాలని రైతులు కోరుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే జయరాం కూడా ఆ ప్రాజెక్టు విషయంగా ముఖ్యమంత్రి, అధిక శాఖామంత్రి వద్ద గట్టి ప్రయత్నం చేస్తున్నారు. 2017లో పామిడి సభలో చంద్రబాబు ఈ ప్రాజెక్టుకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగా.. తప్పక సాకారం అవుతుందని భావిస్తున్నారు. కాగా జీబీసీకి హెచ్చెల్సీ నీరు లభించే అవకాశం అడుగంటినందున, హంద్రీనీవా నుంచి గ్రావిటీ కింద సాగునీరందించే అవకాశం ఉంది. ఈ విషయంగా కూడా ప్రతిపాదన ఉందగా, దానిని ఆమోదిస్తే నియోజకవర్గంలోని గుంతకల్లు, గుత్తి, పామిడి మండలాల్లోని 16,271 ఎకరాలకు సాగునీరు లభిస్తుంది. ఈ ప్రాజెక్టుకు ఆమోదం తెలపాలని సీఎంకు రైతులు విన్నవించుకుంటున్నారు.

ఆయకట్టు కోసం ఎదురుచూపు

ఉరవకొండ: హంద్రీనీవా ఆయకట్టు రైతులు ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో హంద్రీనీవా డిస్ట్రిబ్యూటరీ పనులు పూర్తి చేస్తారని రైతులు గంపెడు ఆశలు పెట్టుకున్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రధాన కాలువపై మాత్రమే దృష్టి సారించారు. పిల్లకాలువలు పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రతిపక్ష హోదాలో జగన్మోహన్ రెడ్డి గతంలో ఇచ్చిన హామీని నీటి మీద రాతలుగా మారిపోయాయని రైతులు పేర్కొంటున్నారు. 2017 ఫిబ్రవరిలో ఉరవకొండలో జరిగిన మహాధర్నాలో జగన్ మాట్లాడుతూ.. తాము అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో మిగిలిపోయిన డిస్ట్రిబ్యూటరీ పనులు పూర్తిచేసి, ఆయకట్టుకు నీరు అందిస్తామన్నారు. హంద్రీనీవా కాలువపై వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు నిర్లక్ష్యం ప్రదర్శించింది. కనీసం కాలువలో గంపెడు మట్టి కూడా తీయలేదు. హంద్రీనీవా ప్రాజెక్టులను తీవ్ర నిర్లక్ష్యం చేసింది. తవ్విన పిల్లకాలువలలో కూడా పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలతో కాలువ రూపురేఖలే మారిపోయాయి. కృష్ణాజలాలతో రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు 1989లో హంద్రీనీవా పథకానికి అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారు. రాయలసీమలోని కర్నూలు, అనంతపురం, చిత్తూరు, జిల్లాలకు కృష్ణా జలాలు తరలించడమే ప్రధాన ఉద్దేశం. 2019 వరకూ జరిగిన ప్రభుత్వాల హయాంలో పనులను ముందుకు తీసుకెళ్లాయి. హంద్రీనీవాకు సంబంధించిన పనులు 2012లోనే 95శాతం పనులు పూర్తయ్యాయి. అప్పటినుంచి ప్రధాన కాలువకు నీరు ప్రవహిస్తోంది. నీరు ప్రవహిస్తున్నా కాలువ నుంచి ఆయకట్టుకు ఉపయోగించుకోలేని పరిస్థితి. ప్రధాన కారణం హంద్రీనీవా కాలువ నుంచి డిస్ట్రిబ్యూటరీలు పూర్తికాకపోవడమే. 33, 34, 36 ప్యాకేజీల్లో డిస్ట్రిబ్యూటరీ పనులు కూడా చేపట్టారు. 33, 34 ప్యాకేజీల్లో 90 శాతం పనులు గతంలోనే పూర్తయ్యాయి. వంతెనలు, కల్వర్టులు, అక్విడెక్టుల నిర్మాణం పూర్తి కావాల్సి ఉంది. 2 నుంచి 3 శాతం పనులు పూర్తి కావాల్సి ఉన్నా.. ఐదేళ్లు వైసీపీ ప్రభుత్వం ఆ దిశగా అడుగు కూడా వేయలేదు. 36వ ప్యాకేజీలో 18శాతం పనులు పూర్తయ్యాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 25శాతం కంటే తక్కువ పూర్తయిన పనులను రద్దు చేశారు.

సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

కలెక్టర్ వినోద్‌కుమార్

ఉరవకొండ, మే 8(ఆంధ్రజ్యోతి): సీఎం పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. వజ్రకరూరు మండలం ఛాయాపురం గ్రామంలో సీఎం పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను కలెక్టర్ గురువారం పరిశీలించారు. సీఎం పర్యటన సందర్భంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. లోటుపాట్లు లేకుండా పర్యటనను జయప్రదం చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. సీఎం పర్యటించే ప్రాంతాల్లో కాన్వాయ్ రిహార్సల్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్పీ జగదీష్, జేసీ శివనారాయణ శర్మ, ఎస్పీలు రమణమూర్తి, ఇలియాజ్ బాషా, డీఎస్పీలు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

సీఎం పర్యటనకు పటిష్ట భద్రత

ఎస్పీ రత్న



మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో సత్యసాయి విమానాశ్రయంలో పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని ఎస్పీ రత్న తెలిపారు. సీఎం భద్రత అధికారి చంద్రశేఖర్‌తో కలిసి బందోబస్తుపై పోలీసు అధికారులకు ఆమె గురువారం దిశానిర్దేశం చేశారు. అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. వై జంక్షన్ నుంచి ముఖ్య ప్రజాప్రతినిధుల వాహనాలను మాత్రమే ఎయిర్‌పోర్టు వరకు అనుమతించాలని సూచించారు. ప్రధాన ద్వారం వద్ద క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి, విమానాశ్రయంలోకి పంపాలని సూచించారు. కలెక్టర్ మంజూరు చేసిన జాబితాలో పేర్లు ఉన్నవారిని మాత్రమే లోపలికి అనుమతించాలని సూచించారు. సమీక్షలో డీఎస్పీలు విజయ్ కుమార్, నరసింగప్ప, శివన్నారాయణస్వామి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్పీ సీసీ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఎస్బీ ఎస్ఐ ప్రదీప్ కుమార్, ఆర్ఐలు వలి, మహేష్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

- ముఖ్యమంత్రి పర్యటనకు ముగ్గురు డీఎస్పీలు, 13 మంది సీఐలు, 12 మంది ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుల్స్ 99 మంది, పీసీలు 114 మంది, మహిళా పోలీసులు 36 మంది, హోంగార్డు 65 మంది, మొత్తం స్పెషల్‌పార్టీ బృందాలు, మూడు ఏఆర్ టీంలతో భద్రత ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ తెలిపారు.

మోడల్ డీఎస్సీ పరీక్షలు సద్వినియోగం చేసుకోండి

డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం విద్య/క్లాక్‌టవర్, మే 8(ఆంధ్రజ్యోతి): మోడల్ డీఎస్సీ పరీక్షలు సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ ప్రసాద్‌బాబు పేర్కొన్నారు. ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మోడల్ పరీక్షల పోస్టర్లను డీఈఓ ఆఫీస్‌లో ప్రసాద్‌బాబు, అర్బన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్, సొసైటీ అధ్యక్షుడు రమేష్ ఆవిష్కరించారు. డీఈఓ మాట్లాడుతూ.. ఈనెల 24న డీఎస్సీ అభ్యర్థుల కోసం ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచితంగా మోడల్ డీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. మెగా డీఎస్సీ పరీక్షలు రాసే అభ్యర్థులకు ఇవి ఉపయోగపడతాయన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 18వ తేదీలోగా స్థానిక అరవింద్ నగర్‌లోని 13-186 డోర్ నంబర్‌లోని ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయవచ్చన్నారు. ఆన్‌లైన్‌లోగానీ చేసుకోవచ్చన్నారు. వివరాలకు 9059055965 నంబరులో సంప్రదించాలని ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకుడు సుంకర రమేష్ తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంకు డైరెక్టర్లు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఈఓ, జేఎల్ మురళి

గుర్తుతెలియని వృద్ధుడి అనుమానాస్పద మృతి

గార్లదిన్నె, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కనుంపల్లి సమీపాన ఓ గుట్టలో గుర్తుతెలియని వృద్ధుడు (60) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. కనుంపల్లి సమీపంలోని గుట్ట నుంచి దుర్వాసన వస్తుండడంతో అటువైపు వెళ్లిన పశువుల కాపర్లు వెళ్లి చూశారు. వృద్ధుడి మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని, పరిశీలించారు. వృద్ధుడు నాలుగు రోజుల క్రితం మృతిచెంది ఉంటాడని పోలీసులు అంచనా వేశారు. మృతుడు తెల్లటి షర్టు, తెల్లటి పంచె, తెల్లటి బనియన్, ఎర్రటి డ్రాయర్ ధరించి ఉన్నాడు. రైతు ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహం పక్కన కూల్‌డ్రింక్ బాటిల్, పురుగు మందు డబ్బా ఉండడంతో ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

బైక్ నుంచి పడి వృద్ధురాలి మృతి



పెద్దక్క(ఫైల్)

బత్తలపల్లి, మే8(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లబోయనపల్లికి చెందిన పెద్దక్క (76) ప్రమాదవశాత్తు బైక్ నుంచి పడి గురువారం మృతిచెందింది. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన ఓబులేసు భార్య పెద్దక్క బుధవారం గ్రామంలోని స్టోర్ బియ్యం తెచ్చుకునేందుకు వెళ్లింది. అదే గ్రామానికి చెందిన హరీష్ బైక్‌లో బయల్దేరింది. మార్గమధ్యలో పెద్దక్కకు కళ్లు తిరిగి కింద పడి గాయపడింది. వెంటనే పెద్దక్కను బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. పెద్దక్క కుమారుడు పుల్లన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ సోమశేఖర్ తెలిపారు.

వడ్డీ వ్యాపారి ఆత్మహత్య



రామనాథరెడ్డి(ఫైల్)

తాడిపత్రి, మే8(ఆంధ్రజ్యోతి): స్థానిక సీపీఐ కాలనీకి చెందిన వడ్డీ వ్యాపారి రామనాథ్ రెడ్డి (50) గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. రామనాథరెడ్డి వడ్డీలకు ఇచ్చిన రుణాలు సకాలంలో వసూలు కాకపోవడంతో మనస్తాపం చెందాడు. పట్టణంలోని గుడ లాడ్జిలో గదిని అద్దెకు తీసుకుని, పురుగుల మందు తాగాడు. గమనించిన లాడ్జి సిబ్బంది.. పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రామనాథరెడ్డి మృతిచెందాడు. అతడికి భార్య వెంకటలక్ష్మమ్మ, కుమారుడు రవితేజారెడ్డి, కుమార్తె వందన ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

మళ్లీ సైన్యంలో చేరతా..

బీఎస్ఎఫ్ మాజీ జవాను ఆసక్తి



వడ్డే శీనప్ప

చెన్నేకొత్తపల్లి, మే8(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం భారత్-పాక్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో దేశరక్షణ కోసం తిరిగి సైనిక సేవలందించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని బీఎస్ఎఫ్ మాజీ జవాను వడ్డే శీనప్ప పేర్కొన్నారు. మండల కేంద్రంలోని తన గృహంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. బీఎస్ఎఫ్‌లో 24 ఏళ్లపాటు పనిచేశానన్నారు. అందులో 21 ఏళ్ల పాకిస్థాన్ సరిహద్దులో విధులు నిర్వహించానన్నారు. కుటుంబ పరిస్థితుల దృష్ట్యా గతేడాది బీఎస్ఎఫ్ హెడ్ కానిస్టేబుల్ హోదాలో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశానన్నారు. ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా తిరిగి విధుల్లోకి చేరి సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. దేశ రక్షణ రంగంలో పనిచేసి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన వారందరినీ తిరిగి విధుల్లోకి తీసుకుని, వారి సేవలను వినియోగించుకోవాలని ఆయన.. ప్రభుత్వాన్ని కోరారు.

రెండు బైకులు ఢీ.. ఇద్దరు బిహార్‌వాసుల మృతి

పెనుకొండ రూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): రొద్దం మండలం కల్లుకుంట సమీపంలో జాతీయ రహదారి వద్ద గురువారం రాత్రి రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొని బిహార్‌కు చెందిన రాహుల్ (20), మహమ్మద్ సుభాన్ (30) మృతిచెందారు. మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. మహమ్మద్ సుభాన్ పెద్దగొట్టాల ఏ స్టేట్‌లో పనిచేస్తున్నాడు. తన కుమారుడితో కలిసి రొద్దం వెళ్లి, తిరిగి వస్తుండగా, రాహుల్, అఫ్సాన్ ఎదురుగా మరో బైక్‌పై వచ్చారు. రెండు బైకులూ వేగంగా ఢీకొన్నాయి. ప్రమాదంలో రాహుల్, మహమ్మద్ సుభాన్ అక్కడికక్కడే మృతిచెందారు. గాయపడిన అఫ్సాన్‌తోపాటు సుభాన్ కుమారుడిని 108 వాహనంలో పెనుకొండ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్సకోసం అనంతపురం తరలించారు. మృతదేహాలను పెనుకొండ ఆసుపత్రికి తరలించారు. రొద్దం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి వెబ్‌లో మార్కుల జాబితాలు

అనంతపురం విద్య, మే 8(ఆంధ్రజ్యోతి): పదో తరగతి మార్కుల మెమోలు శుక్రవారం నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని డీఈఓ ప్రసాద్‌బాబు, ఏసీ గోవింద్ నాయక్ గురువారం తెలిపారు. అన్ని స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు తమ లాగిన్ ద్వారా ఎస్ఎస్‌సీ బోర్డ్ వెబ్‌సైట్ నుంచి మార్కుల జాబితాలు డౌన్‌లోడ్ చేసి, సంతకాలు చేసి విద్యార్థులకు అందించాలని సూచించారు. మార్కుల మెమోల్లో ఏవైనా తప్పులు దొర్లినట్లు హెచ్‌ఎంలు, తల్లిదండ్రులు గుర్తిస్తే.. వెంటనే స్కూల్‌లోని విద్యార్థి రికార్డులు, మార్కుల మెమో జిరాక్స్ కాపీలను జత పరిచి ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమాచారాన్ని ఆలస్యం చేయకుండా, ఈనెల 25వ తేదీలోగా డైరెక్టర్‌కు పంపాలని సూచించారు.

'జీవవైవిధ్యం' అవార్డులకు 13లోగా ఎంట్రీలు

అమరావతి, మే 8(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా 'ప్రకృతితో సామరస్యం.. స్థిరమైన అభివృద్ధి' అనే అంశంతో ఈనెల 22న అమరావతిలో నిర్వహించే కార్యక్రమంలో అవార్డులు, బహుమతుల కోసం వివిధ విభాగాల్లో ఎంట్రీలను ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర జీవవైవిధ్య మండలి చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్, సభ్య కార్యదర్శి పి. రామకృష్ణ గురువారం తెలిపారు. జీవవైవిధ్యంలో సాధించిన విజయాలు, సంబంధిత పేపర్ కటింగ్‌లు, ఫోటోలను 'రాష్ట్ర బయో డైవర్సిటీ బోర్డ్, ప్లాట్ నంబరు 209, వాల్మీక్ బ్లాక్, రెయిన్ ట్రీ పార్కు, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా, గుంటూరు జిల్లా-522508' చిరునామాకు ఈ నెల 13లోపు పంపాలని సూచించారు.

న్యూస్ బాక్స్

పాండురంగస్వామి నిజపాద స్పర్శ దర్శనం



అనంతపురం కల్చరల్, మే 8(ఆంధ్రజ్యోతి): వైశాఖ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని గురువారం రామ్‌నగర్‌లోని రుక్మిణి పాండురంగస్వామి దేవాలయంలో స్వామి నిజపాద స్పర్శ దర్శన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో భావసార క్షత్రియ సమాజ్ అధ్యక్ష కార్యదర్శులు తిరుపతిరావు, ఆనంద్, కార్యవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన

గార్లదిన్నె, మే 8(ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షల ఆధారంగా పైర్లకు ఎరువులు వేయాలని వ్యవసాయ శాఖ ఏడీ రవి పేర్కొన్నారు. స్థానిక రైతు సేవాకేంద్రంలో గురువారం భూసార పరీక్ష కేంద్రం వ్యవసాయ అధికారి శ్రీనాథ్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ ఆధ్వర్యంలో మట్టి పరీక్షలు ఆధారంగా ఎరువుల యాజమాన్య పద్ధతులు అనే అంశంపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈఓ స్రవంతి, రైతుసేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉపాధిలో అక్రమాలకు పాల్పడితే చర్యలు: ఎంపీడీఓ

గార్లదిన్నె, మే 8(ఆంధ్రజ్యోతి): జాతీయగ్రామీణ ఉపాధి హామీ పథకంలో అక్రమా లకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ యోగానందరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కోటంక గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం ఏపీఏ ఓబన్నతో కలసి ఎంపీడీఓ తనిఖీ చేశారు. కోటంక, మర్తాడు సచివాలయాల్లో బయోమెట్రిక్ తనిఖీ చేశారు.

ఆర్డీటీకి అండగా నిలవండి

● సీఎంను కలసిన సీపీఐ రామకృష్ణ



సీఎంకు వినతిపత్రం ఇస్తున్న నేతలు

అనంతపురం విద్య, మే 8 (ఆంధ్రజ్యోతి): ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరించేలా కేంద్రంపై ఒత్తిడి పెంచి అండగా నిలవాలని సీపీఐ నేతలు సీఎం చంద్రబాబును కోరారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ఇతర నేతలు గురువారం అమరావతిలో సీఎంను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 1969లో అనంతపురంలో స్థాపించిన ఆర్డీటీ అనేక రకాలుగా పేదలకు సేవలందిస్తోందని గుర్తు చేశారు. అనంతపురం, కర్నూలు, చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో మూడు వేలకు పైగా గ్రామాల్లో సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. ఎఫ్‌సీఆర్‌ఏ ద్వారా వివిధ దేశాల నుంచీ ఆర్డీటీకి అందుతున్న సాయం ద్వారానే ఈ కార్యక్రమాలు ఇప్పటి వరకూ చేస్తూ వచ్చారని వివరించారు. ప్రస్తుతం కేంద్రం ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ నిలిపివేసిందన్నారు. కేంద్రంపై ఒత్తిడి పెంచి ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరించేలా చూడాలని కోరారు. ఈ మేరకు వారు సీఎంకు వినతిపత్రం అందించారు. దీనిపై సీఎం స్పందిస్తూ.. ఆర్డీటీ సమస్యను టేకప్ చేస్తామని హామీ ఇచ్చినట్లు సీపీఐ నేతలు తెలిపారు.

రాప్తాడు మార్కెట్ యార్డు చైర్మన్‌కు...



చైర్మన్ సుధాకర్‌ను సత్కరిస్తున్న నాయకులు

అనంతపురం రూరల్, మే8(ఆంధ్రజ్యోతి): రాప్తాడు మార్కెట్ యార్డు చైర్మన్‌గా నియమితులైన సుధాకర్‌ను మండ లంలోని కక్కలపల్లికి చెందిన పలువురు టీడీపీ నాయకులు కలిశారు. కక్కలపల్లి టమోటా మండీలో గురువారం ఆయనను కలసి శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. మాజీ ఎంపీ టీసీ నారాయణ స్వామి, సత్యసాయి జిల్లా టీఎన్‌టీయూసీ కార్యదర్శి రాయల్‌రాజు, టీడీపీ సీనియర్ నాయకులు బండి నరసింహులు, స్టోర్ డీలర్ వెంకటేశులు, మధు, అన్వర్, బాబాఫక్రుద్దీన్, ఆదినారాయణ, నాగేష్, బాష తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతోనే విజ్ఞానం

శింగనమల, మే 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచి పుస్తకాలు చదవడం ద్వారా భవిష్యత్తులో మంచి విజ్ఞానం కలుగుతుందని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి పి.రమ పేర్కొన్నారు. గురువారం శింగనమల గ్రంథాలయంలో 8వరోజు వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరాన్ని ఆమె తనిఖీ చేశారు. శింగనమల గ్రంథాలయాధికారి జి. కృష్ణ, రంగన్న విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రసన్నాయపల్లిలో ఫైలేరియా సర్వే

రాప్తాడు, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసన్నాయపల్లిలో గురువారం ఫైలేరియా సర్వే చేపట్టినట్లు జిల్లా సబ్ యూనిట్ అధికారి మద్దయ్య తెలిపారు. సూర్యాస్తమయం తరువాత గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సర్వే చేశామన్నారు. గ్రామంలో సుమారు 500 రక్త పూతలు సేకరించామన్నారు. సూపర్‌వైజర్లు శ్రీధర్, నూర్‌బాషా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి ఎమ్మెల్యే సంతాపం



పోతులయ్య భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

నార్పల, మే 8(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని గొల్లపల్లికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు పోతులయ్య(56) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. ఆర్నెల్లుగా అనారోగ్యంతో బాధపడుతుండేవాడని కుటుంబసభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ గొల్లపల్లికి వెళ్లి పోతులయ్య భౌతిక కాయానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. పోతులయ్య మృతి టీడీపీకి తీరని లోటన్నారు. ఎమ్మెల్యేతో పాటు పలువురు టీడీపీ నాయకులు ప్రగాఢ సంతాపం తెలియజేశారు.


సొసైటీ మాజీ అధ్యక్షుడి మృతి

చెన్నేకొత్తపల్లి, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని దామాజిపల్లికి చెందిన సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు సంజీవరెడ్డి(82) అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. పరిస్థితి విషమించడంతో అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు బంధువు లు తెలిపారు. ఆయన 2012 నుంచి 2017 వరకు దామాజిపల్లి సొసైటీ అధ్యక్షుడిగా పనిచేశారు. విషయం తెలుసుకున్న పలువురు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

శిథిలావస్థలో కార్యాలయాలు



పునాదులకే పరిమితమైన తహసీల్దార్ కార్యాలయ నిర్మాణం



పెచ్చులూడుతున్న ప్రస్తుత భవనం

● పెచ్చులూడుతున్న గదుల పైకప్పులు
● భయంభయంగా విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

ఆత్మకూరు, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు పూర్తి శిథిలావస్థకు చేరుకున్నాయి. అవి ఎప్పుడు కూలుతాయో, ఎటువంటి ప్రమాదం సంభవిస్తుందో అనే భయాందోళన తోనే ఆయా కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది నిత్యం విధులు నిర్వహిస్తున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాయలం, వ్యవసాయ కా ర్యాలయంతో పాటు మరిన్ని కార్యాయలాల పరిస్థితి ఇలా ఉంది. తహసీల్దా ర్ కార్యాలయం పైకప్పు పెచ్చులు ఊడిపడుతున్నాయి. దీంతో స్లాబ్‌కు ఉపయోగించిన కడ్డీలు తుప్పుపట్టి కనిపిస్తున్నాయి. కార్యాలయం వరండా, ప్రధాన హాలు, గదులు, వీఆర్‌ఓల ప్రధాన హాలు పైకప్పుల పెచ్చులూడాయి. అలాగే తరచూ పెచ్చులు ఊడి డుతుండటంతో అధికారులు, సిబ్బంది భ యాందోళన మధ్యనే కార్యాలయంలో విధులు నిర్వహించాల్సివస్తోంది. తహసీల్దార్ కార్యాలయం నూతన భవన నిర్మాణానికి ఆరేళ్ల కిందట అప్ప ట్లో మంత్రిగా ఉన్న ఎమ్మెల్యే పరిటాల సునీత రూ. కోటి నిధులు మంజూరు చేయించారు. పునాదులు నిర్మించారు. అంతలోనే ఎన్నికలు రావడం, వైసీపీ అధికారంలోకి రావడంతో ఆ ఐదేళ్ల ఆ భవనం నిర్మాణ పనులు పట్టించుకోలేదు. పాత కార్యాలయం నానాటికి దెబ్బతింటూ ప్రస్తుతం పైకప్పు పెచ్చులూడే స్థితికి చేరింది. ప్రస్తుత ప్రభు త్వమైనా నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ కార్యాలయ అధికారులు, సిబ్బంది కోరుతున్నారు. అదేవిధంగా ఎంపీడీఓ కార్యాలయం కూడా పాత భవనం కావడంతో మరమ్మతుల కోసం ఆ కార్యాలయం అధికారులు ప్రతిపాదనలు పంపారు. నిధులు మంజూరు కాకపోవడంతో భవనాలు శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారాయి. ఇక వ్యవసాయ కార్యాలయానికి విద్యుత్ సౌకర్యం సక్రమంగా లేకపోవడం, గోడలు బీటలు బారడంతో అధికారులు రైతు సేవా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్నారు. కార్యాలయం చుట్టూ కంప చెట్లు పెరిగాయి. ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకుని ఆయా కార్యాలయాల పాత భవనాలకు మరమ్మతులు చేపట్టాలని అధికారులు, సిబ్బంది, ప్రజలు కోరుతున్నారు.

ప్రైవేటు రుణాలు తీసుకుని మోసపోకండి



స్త్రీనిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

● మహిళా సంఘాలకు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచన
● రూ.3.41కోట్ల స్త్రీనిధి రుణాల చెక్కుల పంపిణీ

రామగిరి, మే 8(ఆంధ్రజ్యోతి): మహిళలు ప్రైవేటు రుణాలను తీసుకుని మోస పోవద్దని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా చెల్లించాలని సూచించారు. మండలకేంద్రమైన రామగిరిలో గురువారం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులకు ఎమ్మెల్యే పరిటాల సునీత చేతులమీదుగా స్త్రీనిధి రుణాలను పంపిణీచేశారు. మండలవ్యాప్తంగా 106 సంఘాల్లోని 398 మంది మహిళలకు రూ.3.41కోట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఒకప్పుడు వంటిల్లు, పొలం పనులు తప్ప వేరే లోకం తెలియని మహిళలను పురుషులతో సమానంగా వ్యాపారం చేసే స్థాయికి తీసుకొచ్చింది సీఎం చంద్రబాబే అన్నారు. అలాగే గత టీడీపీ పాలనలో సీఎం చంద్రబాబు స్వయం సహాయక సంఘాల్లోని ఒక్కో మహిళకు పసుపు, కుంకుమ కింద రూ.10వేలు ఇచ్చారని గుర్తు చేశారు. ఆ ఎన్నికలలో మోసంచేశారని ఆ తరువాత ప్రజలు ఎంత ఇబ్బందులు పడ్డారో చూశార న్నారు. అప్పుడే ముఖ్యమంత్రిగా చంద్రబాబు వచ్చి ఉండిఉంటే హంద్రీనీవా ప్రాజెక్టు పూర్తి చేసి పేరూరు జలాశయానికి నీరు కూడా వచ్చేదన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని తెలుసుకుని మళ్లీ ముఖ్యమంత్రిగా చంద్రబాబును తెచ్చుకున్నామ న్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కచ్చితంగా నేరవేరుస్తామన్నారు. ఈ నెలలోనే తల్లికి వందనం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా వారందరికి రూ.15వేలు చొప్పున అందజేస్తామన్నారు. అన్నదాత సుఖీభవ అందిస్తామని తెలిపారు. కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని, కొత్త పింఛన్‌లు కూడా త్వరలోనే వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, స్త్రీనిధి ఏజీఎం వేణు గోపాల్, టీడీపీ సీనియర్ నాయకులు రామ్మూర్తినాయుడు, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్య, మండల కన్వీనర్ సుధాకర్, నాయకులు మారుతీప్రసాద్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సుకన్య, వెలుగుసిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై కళాజాతాతో చైతన్యం

● జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్

అనంతపురం టౌన్, మే 8(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ నియంత్రణపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకే కళాజాతా నిర్వహిస్తున్నట్లు ఎయిడ్స్ నియంత్రణ విభాగం జిల్లా అధికారి డాక్టర్ అనుపమజేమ్స్ పేర్కొన్నారు. ఆమె గురువారం వైద్యశాఖ కార్యాలయం ఆవరణంలో జెండా ఊపి కళాజాతా బృందాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... జిల్లాలోని 20 గ్రామాల్లో హెచ్ఐవీ ప్రభావం ఎక్కువగా ఉందని, ఆయా గ్రామాలలో ఈబృందాలు 20 రోజులు ప్రదర్శనలు నిర్వహిస్తాయన్నారు. కార్యక్రమంలో జిల్లా సూపర్‌వైజర్ జీవీ రమణ, పీఎంఓ నాగన్న, మురళి, నారాయణస్వామి, కళాజాతా బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఇక.. డాక్టర్ల పనితీరుపై వ్యక్తిగత నివేదికలు

● సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు హెచ్చరిక

అనంతపురం టౌన్, మే 8(ఆంధ్రజ్యోతి): ఇప్పటివరకు విభాగాల వారీగా పనితీరును డీఎంఈకి పంపేవాళ్లమని, ఇకనుంచి ప్రతి విభాగంలోను ప్రతి డాక్టరు నెలవారీగా సాధించిన లక్ష్యాల ప్రగతిని పంపాల్సి ఉంటుందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు హెచ్‌ఓడీలకు సూచించారు. ఆయన గురువారం తన చాంబర్‌లో హెచ్‌ఓడీలతో సమీక్ష నిర్వహించారు. ఎన్టీఆర్ వైద్యసేవ, పారిశుధ్య, పనితీరు తదితర సమాచారాన్ని పక్కాగా నమోదుచేసి పంపాలన్నారు. ఆయా విభాగాల డాక్టర్లు, సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించకపోతే హెచ్‌ఓడీలే బాధ్యత వహించాల్సి ఉంటుందని సూపరింటెండెంట్ హెచ్చరించారు. సమావేశంలో ఆర్ఎంఓలు, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో పోస్టులపై కేసు

అనంతపురం క్రైం, మే 8(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై పోస్టులు పెట్టినందుకు మారుతీ కుమార్‌పై గురువారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఫేస్‌బుక్‌లో మారుతీకుమార్ ఐడీ పేరుతో సీఎంను ఉద్దేశించి ఒక పోస్టు, మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి, చంద్రబాబు ఫొటోలు పెట్టి మరో పోస్టులో రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది అని పెట్టాడు. కార్తీక్ ఐడీ పేరుతో జేసీ ప్రభాకర్ రెడ్డి ఇంటికి కార్యకర్తలు తరలి రండి అనే పోస్టులో మారుతీ కుమార్ రక్తచరిత్ర-2గా కామెంట్ చేశాడు. ఈ పోస్టులపై అనంతపురం టీడీపీ అర్బన్ ఎస్సీ సెల్ కార్యదర్శి మన్నల నాగార్జున ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యక్తి అదృశ్యం - కేసు నమోదు

యాడికి, మే8(ఆంధ్రజ్యోతి): అనంతపురం రూరల్ మండలం కురుగుంట గ్రామానికి చెందిన భాస్కర్‌రెడ్డి అనే 33ఏళ్ల వ్యక్తి కనబడకుండా పోయాడని అతని తండ్రి గురివిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు. కురుగుంటకు చెందిన భాస్కర్‌రెడ్డి ఏప్రిల్ 28న యాడికి మండలం కొట్టాలపల్లిలో తమ సమీప బంధువు ఇంట్లో వివాహ రిసెప్షన్‌కు వెళ్లాడు. ఆ తర్వాత కనబడకుండా పోయాడు. బంధువుల ఇళ్లల్లో, స్నేహితుల వద్ద గాలించినా భాస్కర్‌రెడ్డి ఆచూకీ తెలియలేదు. దీంతో తండ్రి గురివి రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేదలకు ఇళ్లస్థలాలు మంజూరు చేయాలి

● సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి

అనంతపురం కల్చరల్, మే 8(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక గణేనాయక్ భవన్‌లో గురువారం సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో చాలా ఏళ్లుగా నివసిస్తున్న పేద ప్రజలు సొంతగూడు లేక, ఇంటి అద్దెలు కట్టలేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రభుత్వం నిరుపేదలకు ఇళ్లస్థలాలు ఇస్తే గుడిసెలు వేసుకుని అయినా జీవిస్తారని, ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉచితంగా ఇళ్లు నిర్మించి ఇస్తే ఇబ్బంది లేకుండా జీవిస్తారన్నారు. సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రకాష్, మసూద్, ముత్తుజ, వెంకటనారాయణ, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అక్రమ రవాణాపై విజిలెన్స్ దాడులు

అనంతపురం న్యూటౌన్, మే 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై విజిలెన్స్ అధికారులు గురువారం ముమ్మర దాడులు చేశారు. ఎస్ఐ గోపాలుడు ఆధ్వర్యంలో విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ వైబీపీటీఏ ప్రసాద్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులతో కలిసి బొమ్మనహాళ్ మండలంలోని సంగమేశ్వర గుడి వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ మార్గంలో వచ్చిన బొలేరో వాహనంలో 37 క్వింటాళ్ల పీడీ ఎస్ బియ్యాన్ని కర్ణాటక రాష్ట్రంలోని చిత్రదుర్గ్ జిల్లా బీజీ కేరేకి తరలిస్తున్నట్లు గుర్తించారు. బియ్యం యజమానులు ఎల్లప్ప, రుద్రన్న, డ్రైవర్ బసవరాజు, అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. సీజ్ చేసిన పీడీఎస్ బియ్యాన్ని స్థానిక రెవెన్యూ అధికారులకు అప్పగించారు. తనిఖీల్లో బొమ్మహాళ్ డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీకాంత్‌నాయక్, ఏఈఈ రవీంద్రనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలపై వైసీపీ వర్గీయుల దాడి



టీడీపీ జెండాపై వైసీపీ జెండా కట్టిన దృశ్యం

ఆత్మకూరు మే 8(ఆంధ్రజ్యోతి): మండల పరిదిలోని వేపచెర్ల గ్రామ పంచాయతీలో గురువారం రాత్రి వైసీపీకి చెందిన కొందరు తమపై దాడి చేసినట్లు టీడీపీ కార్యకర్తలు తెలిపారు. గ్రామంలో కొన్ని నెలల క్రితం టీడీపీ జెండాను ఓ కట్టె కట్టారు. అదే కట్టెకే టీడీపీ జెండాపై గ్రామానికి చెందిన కొందరు వైసీపీ అల్లరి మూకలు ఉద్దేశపూర్వకంగా వైసీపీ జెండా కట్టారని తెలిపారు. దీనిపై మందలించేందుకు వెళ్లిన టీడీపీ కార్యకర్తలపై దాడి చేసి గాయపరిచినట్లు వివరించారు. గాయపడిన వారిని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు వారి కుటుంబసభ్యులు తెలిపారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో చిచ్చురేపేలా ఇలాంటి ఆకతాయిపనులు చేయడం ఏమిటని గ్రామస్తులు విమర్శించారు. మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.

నాలుగోరోజు కొనసాగిన కార్మికుల ధర్నా



కార్మికులతో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ పావని

● డిప్యూటీ కమిషనర్ హామీతో విరమణ

అనంతపురం క్రైం, మే 8(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలంటూ నగరపాలక సంస్థ ఎదుట మున్సిపల్ కార్మికులు చేపట్టిన ధర్నా గురువారం నాలుగో రోజుకు చేరింది. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఏటీఎం నాగరాజు మాట్లాడుతూ... కార్మికులు దీర్ఘకాలంగా పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ఎనిమిది మంది కార్మికులు చనిపోయి మూడేళ్లవుతున్నా వారి ఏ ఒక్క కుటుంబాల వారికీ ఉపాధి కల్పించలేదన్నారు. అధికారుల నిర్లక్ష్యంతో 28మంది కార్మికులకు వేతనాలు అందడం లేదన్నారు. సరెండర్ లీవ్‌ల విషయంలో కార్మికులకు న్యాయం జరగడం లేదన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ పావని ధర్నా వద్దకు వచ్చి కార్మికులతో మాట్లాడారు. కార్మికుల జీతాలకు సంబంధించిన ఉద్యోగిని పిలిపించి రెండు నెలల జీతాలకు చెక్కులు సిద్ధ చేయించి, ఒక చెక్కును బ్యాంకుకు పంపారు. ఇంకో చెక్కును కమిషనర్ సంతకం చేసి పంపుతామని తెలిపారు. కమిషనర్‌తో మాట్లాడి మిగిలిన సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఇందుకు కార్మికులు డిప్యూటీ కమిషనర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ధర్నా విరమిస్తున్నట్లు ప్రకటించారు. తమ సమస్యలను త్వరగా పరిష్కరించకపోతే ఈనెల 20 నుంచి సమ్మెలోకి వెళ్తామని నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు సాకే తిరుమలేష్, లక్ష్మీనరసమ్మ, వరలక్ష్మి, శ్రీనివాస్‌మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ

● నేడు విగ్రహ ప్రతిష్ఠ



పడిపూజకు సిద్ధం చేసిన దృశ్యం

బుక్కరాయసముద్రం, మే 8(ఆంధ్రజ్యోతి): శబరిమల ఆలయంలో జరిగే పడి పూజ తరహాలో మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి దేవాలయంలో నిర్మించిన 18 దైవిక మెట్లకు పడి పూజ (పడినేట్టంపడి) కన్నుల పండువగా సాగింది. ఈ పూజా కార్యక్రమం శబరిమల ప్రధాన అర్చకుల లో ఒకరైన బ్రహ్మదత్త తంత్రి చేతులమీద శాస్త్రోక్తంగా నిర్వహించారు. నూతనంగా నిర్మించిన 18 మెట్లను వివిధ రకాల పూలు, దీపాలతో అలంకరించారు. అయ్యప్ప శరణు ఘోషతో ఆలయం ప్రాంగణం మార్మోగింది. పడిపూజకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అలాగే నూతనంగా నిర్మించిన ఆలయ గోపుర కలశ పూజను ఘనంగా నిర్వహించారు. పడిపూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ హాజరై, పూజల్లో పాల్గొన్నారు.

నేడు విగ్రహ ప్రతిష్ఠ: మండల కేంద్రంలోని చెరువు కట్ట వద్ద నూతనంగా నిర్మించిన ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శబరిమల ప్రధాన అర్చకులు బ్రహ్మదత్త కంఠారు చేతులమీదగా జరుగుతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వీటితో పాటు గణపతి, సుబ్రహ్మణ్య స్వామి, నవగ్రహాలు, హరిహరులు, మాలికాపురత్తమ్మ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం జరగనున్నట్లు తెలిపారు. అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.



పడిపూజ చేస్తున్న శబరిమల ప్రధాన అర్చకుడు బ్రహ్మదత్త తంత్రి

సుప్రీం కోర్టు మాజీ సీజేని కలిసిన వైకుంఠం



తాను రచించిన పుస్తకాన్ని వైకుంఠం ప్రభాకర్ చౌదరికి అందజేస్తున్న జస్టిస్ ఎన్‌వీ రమణ

అనంతపురం అర్బన్, మే 8 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణను డిల్లీలోని ఆయన నివాసంలో గురువారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తాను రచించిన నరేటివ్స్ ఆఫ్ ది బెంచ్ ఆఫ్ జడ్జ్ స్పీక్స్ అనే పుస్తకాన్ని వైకుంఠం ప్రభాకర్ చౌదరికి సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి అందజేశారు.

రేపు మాజీ సైనికుల ర్యాలీ

రాప్తాడు, మే 8(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సింధూర్‌కు మద్దతుగా శనివారం సా యంత్రం రాప్తాడులో మాజీ సైనికుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మాజీ సైనికుల సంఘం అనంతపురం జిల్లా జనరల్ సెక్రటరీ సుదర్శన్‌రెడ్డి, రాప్తాడు అధ్యక్షుడు పరమేశ్‌రెడ్డి గురు వారం ఓ ప్రకటనలో తెలిపారు. కుల మతాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. దేశ ప్రజలందరూ ఒక్కటే అనే నినాదంతో ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు.

ప్రాణం తీసిన ఈత సరదా

● బావిలో మునిగి యువకుడి మృతి



బాబావలి మృతదేహం



బాబావలి (ఫైల్)

గార్లదిన్నె, మే 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కల్లూరులో స్నేహితులతో కలసి బావిలో సరదగా ఈత కొడుతూ బాబావలి(28) అనే యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఇల్లూరుకు చెందిన దస్తగిరి, ఫాతిమా దంపతుల కుమారుడు బాబా వలి, కల్లూరులో వెల్డింగ్ పనులు చేసేవాడు. తన భార్య ముబీనాతో కలిసి ఇటీవల కల్లూరుకు వచ్చి నివాసం ఉంటున్నాడు. స్నేహితులో కలసి గురువారం మధ్యాహ్నం అమ్మ బావి అనే బావిలో ఈత కొట్టేందుకు వెళ్లి మునిగి పోయాడు. స్నేహితులు గాలించినా కనిపించలేదు. విషయం తెలుసుకున్న పోలీసులు, గ్రామస్థులు బావిలో సాయంత్రం వరకు వెతికి, ఇనుప కొక్కెంతో మృతదేహాన్ని బయటకు తీశారు. అది చూసి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాబావలికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ఆర్డీటీని దూరంచేసే కుట్రలను నిలువరించాలి

● రిలేదీక్షల్లో పలువురు నాయకులు

అనంతపురం సెంట్రల్, మే 8(ఆంధ్రజ్యోతి): నిస్వార్థంగా సేవలందిస్తున్న ఆర్డీటీని పేదలకు దూరంచేసేలా సాగుతున్న కుట్రలను నిలువరించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఆర్డీటీకి ఎఫ్ఆర్‌సీఏ అనుమతులు కొనసాగించాలని అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలేదీక్షలు గురువారం నాల్గవరోజుకు చేరుకున్నాయి. కమిటీ కన్వీనర్ సాకేహరి అధ్యక్షతన నిర్వహిస్తున్న దీక్షలకు పలు ప్రజాసంఘాల నాయకులు సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు సుగమంచి సురేష్, శ్రీనివాసులు, ఓబులేసు, అడ్వకేట్ నాగన్న, గంగాధర్, రామకృష్ణ, అనిల్‌కుమార్, కేపీ రాజు, షఫీ, టీకేఎస్ ఆనంద్, కృష్ణారెడ్డి, తిక్కన్న, చిన్న అంజనేయులు, రామచంద్రారెడ్డి, ప్రభాకర్, రాము, అంజి, గోవర్ధన్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాతృదేవోభవ పోస్టర్ల ఆవిష్కరణ

అనంతపురం కల్చరల్, మే 8(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని సాయి ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం చిన్మయా జగదీశ్వరాలయంలో మాతృదేవోభవ కార్యక్రమం చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను గురువారం చిన్మయా మిషన్ ప్రతినిధి స్వామి ఆత్మవిదానంద సరస్వతి చేతులమీదుగా చిన్మయా జగదీశ్వరాలయంలో ఆవిష్కరించారు.

సంక్షిప్త వార్తలు

వాసవీమాతకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో వాసవీమాత

గుంతకల్లుటౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీమాత జయంతి మహోత్సవాలలో భాగంగా గురువారం ఆలయంలో విష్ణుసాహస్రపారాయణ నిర్వహించారు. ఉదయం 10 గంటలకు సౌందర్యలహరి పారాయణం, మహిళలచేత వాయనం, హోమం నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సైన్యానికి, ప్రధాని మోదీకి శక్తి ప్రసాదించాలని హోమం నిర్వహించారు.

హంద్రీనీవా కాలువ సామర్థ్యాన్ని పెంచాలి

గుంతకల్లుటౌన్, మే 8(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువను పది వేల క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ, సీపీఎం నాయకులు, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ మాజీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు గురువారం ఆయా పార్టీ కార్యాలయాల్లో బహిరంగ లేఖను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో 33 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం ఉన్నా మూడు, నాలుగు శాతం మాత్రమే నీటి సౌకర్యం ఉందన్నారు. పది వేల క్యూసెక్కుల సామర్థ్యంతో కాలువను వెడల్పు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, నాగరాజు, రఘునాథ్‌రెడ్డి, సత్తార్, రామాంజనేయులు, రామ్‌దాస్, గోపి, శ్రీనివాసులు, మారుతిప్రసాద్, విరుపాక్షి, నారాయణరెడ్డి, సుంకిరెడ్డి, ఓబయ్య, నాగిరెడ్డి పాల్గొన్నారు.

13న కసాపురం హుండీ లెక్కింపు

గుంతకల్లుటౌన్, మే 8(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో ఈనెల 13న హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ కె.వాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లెక్కింపులో ఆలయ అధికారులు, సిబ్బంది, పాల్గొన్నాలని ఈఓ కోరారు.

డాక్టర్ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు చేపట్టిన మస్రద్‌జాహా

విడపనకల్లు మే 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలిగా మస్రద్‌జాహా గురువారం బాధ్యతలు చేపట్టారు. విడపనకల్లులో విధులు నిర్వహిస్తున్న వైద్యులు రాజేంద్ర ఉన్నత చదువులు వెళ్లటంతో ఇక్కడ రెండో డాక్టర్ పోస్టు ఖాళీగా ఉండేది. ఉరవకొండ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న మస్రద్‌జాహాను ఇక్కడికి బదిలీ చేశారు. ఈ మేరకు ప్రథమ వైద్యురాలు పుష్పా ఆమెకు బాధ్యతలు అప్పగించారు.

వాహనం బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

కళ్యాణదుర్గం రూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కామక్కపల్లి-బోయలపల్లి సమీపంలోని ప్రధాన రోడ్డులో ఐషర్ వాహనం బోల్తాపడిన సంఘటన బుధవారం అర్ధరాత్రి సమయంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన మేరకు.. కళ్యాణదుర్గం నుంచి కంబదూరుకు ఐషర్ వాహనంలో టమోటా పంటకు ఉపయోగించే కట్టెలు వేసుకుని వెళ్తున్నారు. ఇదే దారిలో ద్విచక్రవాహనం రావడంతో తప్పించబోయి ఐషర్ వాహనం బోల్తా పడింది. ఘటనలో కంబదూరుకు చెందిన డ్రైవర్ నీలకంఠేశ్వర్‌కు గాయాలు కావడంతో కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

బియ్యం కార్డులకు దరఖాస్తు చేసుకోండి

బెళుగుప్ప/శెట్టూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): అర్హులైన వారు ప్రభుత్వం మంజూరుచేసే కొత్త రేషన్ బియ్యం కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని బెళుగుప్ప తహసీల్దార్ షర్మిల, శెట్టూరు తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టి గురువారం వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం ఏడు సర్వీసులను అందుబాటులో వుంచిందన్నారు. కొత్త కార్డులు, మార్పులు, చేర్పులు, తొలగింపులు చేసుకోవచ్చునన్నారు. ఆధార్ కార్డులో పొరపాట్లు వున్నా సరిదిద్దుకునే అవకాశం కల్పించిందన్నారు.

ధర్మకర్తల మండలికి..

గుంతకల్లుటౌన్, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుగ్గసంగాల గ్రామంలో వెలసిన బుగ్గసంగమేశ్వర ఆలయం ధర్మకర్తల మండలి సభ్యులుగా దరఖాస్తు చేసుకోవాలని ఈఓ కృష్ణయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఫారం-2లో చిరునామా నమోదు చేసి, దరఖాస్తును 20 రోజుల్లో దేవదాయశాఖ సహాయ కమిషనర్ అనంతపురం కార్యాలయంలో సమర్పించాలని వివరించారు.

74 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

బొమ్మనహాళ్, మే 8(ఆంధ్రజ్యోతి): మండలం నుంచి అక్రమంగా కర్ణాటక ప్రాంతానికి పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ ఎస్ఐ గోపాల్ తెలిపిన వివరాల మేరకు.. బొలెరో వాహనంలో 74 బస్తాలు (37 క్వింటాళ్ల బియ్యం) అక్రమంగా తరలిస్తుండగా మండలంలోని సింగానపల్లి సమీపంలో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. డ్రైవర్ బసవరాజు, బియ్యం వ్యాపారులు ఎల్లప్ప, రుద్రన్నపై కేసు నమోదు చేసి వాహనం సీజ్ చేసినట్లు వివరించారు.

ఎంపీడీవోగా జిలానీ

శెట్టూరు, మే 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నూతన ఎంపీడీవోగా జిలాని బాధ్యతలు స్వీకరించారు. పుట్లూరు మండలం ఈవోఆర్డీగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగోన్నతిపై శెట్టూరు ఎంపీడీవోగా నియమించినట్లు ఆయన తెలిపారు. ఆయనకు ఈవోఆర్డీ రఘురామారావు, సీనియర్ సహాయకులు సరిత, సిబ్బంది పుష్పగుచ్ఛమిచ్చి స్వాగతం పలికారు.

రైతులకు పరిహారం పంపిణీ

బెళుగుప్ప, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసాపురం గ్రామ సమీపంలో కొత్త రైల్వే స్టేషన్ నిర్మాణానికి భూములు కోల్పోయిన రైతులకు పరిహారం పంపిణీ చేసినట్లు తహసీల్దార్ షర్మిల బుధవారం వెల్లడించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విలేకరులతో మాట్లాడుతూ.. నరసాపురం గ్రామ సమీపంలో కొత్త రైల్వే స్టేషన్ నిర్మించడానికి 14.67 ఎకరాల సేకరణ పూర్తి చేశామన్నారు. ఎకరా రూ. 12 లక్షలతో ప్రభుత్వం కొనుగోలు చేసిందని 16 మంది భూములు కోల్పోయారని తెలిపారు. ఈ రైతులకు పరిహారం చెక్కులను ఆర్డీవో వసంతబాబు చేతుల మీదుగా పంపిణీ చేశామన్నారు.


రైతుకు చెక్కు పంపిణీ చేస్తున్న ఆర్డీవో వసంతబాబు

తాడిపత్రి పోలీస్ స్టేషన్ వద్ద బీజేపీ ఆందోళన

ఆపరేషన్ సిందూర్ సంబరాలను అడ్డుకున్న సీఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్


పోలీస్ స్టేషన్ ముందు నిరసన, ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరితో మాట్లాడుతున్న నాయకులు

తాడిపత్రి, మే 8(ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద బీజేపీ, ఆర్‌ఎస్ఎస్, వీహెచ్‌పీ, హిందూ ఐక్యవేదిక నాయకులు గురువారం ఆందోళనకు దిగారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైనందుకు పట్టణంలో తాము బుధవారం సంబరాలు నిర్వహిస్తుంటే సీఐ సాయిప్రసాద్ అడ్డుకున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఐపై దేశద్రోహం కింద కేసు నమోదు చేయాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు జాతీయ జెండాలను చేత బట్టుకుని భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేస్తూ పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు. పోలీసు సిబ్బంది స్టేషన్ గేటు వేసి, వారిని బయటే ఆపేశారు. పోలీసులను తోసుకుని లోపలకు వెళ్లారు. సీఐకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేశ్ మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్ ఉగ్రవాదులను హతం చేసిన సందర్భంగా దేశమంతా సంబరాలు చేసుకుంటే తాడిపత్రిలో మాత్రం పోలీసులు అడ్డుకున్నారని అన్నారు. సంబరాలు చేసుకున్న వారిని పోలీసులు స్టేషన్‌కు పిలిపించి దుర్భాషలాడారని ఆరోపించారు. సీఐ ఈ దేశ పౌరుడు కాదా అని ప్రశ్నించారు. సంబరాలు చేసుకున్న వారికి సహకరించకపోగా, మంత్రి సత్యకుమార్ యాదవ్ గురించి నిర్లక్ష్యంగా మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి అక్కడికి చేరుకుని చర్చించారు. విచారించి, సీఐపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు. నిరసనలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, బీజేవైఎం జిల్లా మాజీ అధ్యక్షుడు హరీష్‌రెడ్డి, ధర్మవరం ఇన్‌చార్జి హరీష్, రాయలసీమ ఇన్‌చార్జి అంకాల్ రెడ్డి, ఆర్ఎస్ఎస్ రాయలసీమ కన్వీనర్ రాధాకృష్ణ, గంగాధర్ యాదవ్ పాల్గొన్నారు.

హెచ్చెల్సీ వంతెన పనులు వేగవంతం చేయండి


వంతెన పనులను పరిశీలిస్తున్న హెచ్చెల్సీ ఈఈ రమణారెడ్డి

బొమ్మనహాళ్, మే 8(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ఎగువకాలువపై జరుగుతున్న పనులను అనంతపురం హెచ్చెల్సీ ఈఈ రమణారెడ్డి పరిశీలించారు. మండల పరిధిలోని ఎగువ కాలువ నాగలాపురం, మైలాపురం, దర్గాహోన్నూరు గ్రామాల వద్ద పరిధిలో జరుగుతున్న వంతెన నిర్మాణం, లైనింగ్ పనులను గురువారం ఆయన పరిశీలించారు. రూ. 37 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులు వేగవంతంగా చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. పనుల్లో నిర్లక్ష్యం వహించకుండా సకాలంలో నాణ్యతతో పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. స్థానికంగా ఉండి నాణ్యతగా పనులు చేయించాలని స్థానిక అధికారులకు సూచించారు. పనులు జరుగుతున్న సమయంలో అధికారులు లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లపై బాధ్యత వదిలేసి మీరు ఎక్కడికి వెళుతున్నారని స్థానిక హెచ్చెల్సీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యత లేకపోతే కాంట్రాక్టర్లు, స్థానిక అధికారులదే బాధ్యత అని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఈ అల్తాఫ్, టీడీపీ నాయకులు సల్లాపురం బాబు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్, ద్విచక్రవాహనం ఢీ

ఒకరు మృతి: మరొకరికి తీవ్ర గాయాలు


రాజు (ఫైల్)

కుందుర్పి, మే 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల సమీపాన గురువారం సాయంత్రం ట్రాక్టర్, ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు.. కుందుర్పి నుంచి పరమేష్ రాళ్ల లోడుతో బండమీదపల్లికి వెళుతున్నాడు. కేజీబీవీ సమీపం నుంచి ద్విచక్ర వాహనంలో రాజు (38) రాధాస్వామి (55) ఎదురుగా వెళ్లే క్రమంలో ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొని అదుపుతప్పి పక్కనే ఉన్న గోతిలోకి పడిపోయింది. రాజుకు బలమైన గాయాలు తగలగా రాధాస్వామికి కుడికాలు పూర్తిగా దెబ్బతింది. స్థానికులు గమనించి 108కు, పోలీసులకు సమాచారం అందించారు. బాధితులను కళ్యాణదుర్గం తరలిస్తుండగా మార్గమధ్యలోనే రాజు (38) మృతి చెందాడు. రాధాస్వామిని మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. జడ్పీటీసీ రాధాస్వామి, రాజు ఇద్దరిదీ మండల పరిధిలోని కరిగానపల్లి. రాజుకు భార్య కమల, కూతురు, కొడుకు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కత్తులతో దాడులు చేసుకున్న అన్నదమ్ములు

డి.హీరేహాళ్, మే 8(ఆంధ్రజ్యోతి): తాగిన మత్తులో మాట మాట పెరిగి ఇద్దరు అన్నదమ్ములు ఒకరినొకరు కత్తులతో దాడి చేసుకొని గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీలో ఉన్న సిద్ధప్పకు ఐదుగురు సంతానం. ఇందులో కొడుకు ప్రతాప్, చిన్న కొడుకు రవి స్థానికంగా కూలి పని చేసుకుంటూ తాగుడుకు బానిసయ్యారు. గురువారం మధ్యాహ్నం ప్రతాప్, రవి తాగిన మత్తులో వాదులాటకు దిగారు. అనంతరం ఇంటి వద్ద ఉన్న గొడ్డలి, చాకుతో గొడవకు దిగారు. ప్రతాప్.. రవిని గొడ్డలితో కాలిని గాయపరిచాడు. రవి కూడా ప్రతాప్‌ను చాకుతో మొఖం, చాతి ఇతర ప్రాంతాలలో కోశాడు. ఐకేపీ కార్యాలయంలో పనిచేస్తున్న గోపాల్ విడిపించేందుకు ప్రయత్నించాడు. అతడిపై కూడా కత్తితో దాడి చేయడంతో గాయపడ్డాడు. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి అక్కడికి చేరుకుని ఇరువురిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం చికిత్స కోసం బళ్లారి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

రాయదుర్గం, మే 8(ఆంధ్రజ్యోతి): చిన్న వయస్సులో చదువులను దూరం చేసి 18 ఏళ్లలోపు బాలికలకు పెళ్లి చేయడం వల్ల అనేక అనర్థాలు చోటుచేసుకుంటాయని, ఇది చట్ట విరుద్ధమని ఆరోగ్య విద్యాబోధకుడు కెంచె లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. గురువారం మండలంలోని వడ్రహోన్నూరు గ్రామంలో బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలపై అవగాహన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్, ఆరోగ్య పర్యవేక్షకుడు రామాంజనేయులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు శైలజానాథ్ పరామర్శ

తాడిపత్రి, మే 8(ఆంధ్రజ్యోతి): యల్లనూరు మండలం కల్లూరు గ్రామం వద్ద కాలువలోపడి మృతిచెందిన నాగలక్ష్మమ్మ, జాషువా, లిదియా మృతదేహాలకు గురువారం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రిలో శింగనమల వైసీపీ సమన్వయకర్త, మాజీ మంత్రి శైలజానాథ్ నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట యల్లనూరు జడ్పీటీసీ భోగాతి ప్రతాప్‌రెడ్డి, కల్లూరు ప్రతాప్‌రెడ్డి, విష్ణునారాయణ తదితరులు ఉన్నారు.

పలు ప్రతిపాదనలకు కౌన్సిల్ ఆమోదం

తాడిపత్రి, మే 8(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయంలో అత్యవసర కౌన్సిల్ సమావేశం వైస్‌చైర్మన్ షెక్షావలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో 23 అజెండాలు, సూచనలు, ప్రతిపాదనలను ఆమోదించారు. మున్సిపల్ జనరల్ ఫండ్ కింద తాడిపత్రి మున్సిపాలిటీలోని కంపోస్ట్‌యార్డులో వాల్‌కు పెయింటింగ్ వేయుటకు 0.18శాతం తక్కువ టెండర్‌కు ఆమోదించారు. ఇంకా పలు అంశాలకు కౌన్సిల్ ఆమోదించింది.

శూరపుబండి కిందపడి వ్యక్తికి తీవ్రగాయాలు

పెద్దవడుగూరు, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుత్తిఅనంతపురం గ్రామ సమీపంలో సుంకులమ్మ, ముత్యాలయ్య తిరుణాల సందర్భంగా ఎద్దులచేత శూరపుబండిని లాగే క్రమంలో వెంకటాంపల్లికి చెందిన వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటనలో పాదాల వేళ్లు పూర్తిగా ఛిద్రమయ్యాయి. అక్కడే ఉన్న ఎస్ఐ ఆంజనేయులు బాధితుడిని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోండి

తాడిపత్రి/పుట్లూరు, మే8(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ తెలిపారు. తాడిపత్రి, పుట్లూరు గ్రంథాలయాల్ని ఆమె ఆకస్మికంగా తనిఖీచేశారు. సమ్మర్‌క్యాంప్‌ను పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థిదశ నుంచే పుస్తక పఠనం అలవరచుకోవాలని తెలిపారు. గ్రంథాలయాన్ని తరచూ సందర్శించాలని సూచించారు. ఆమె వెంట గ్రంథాలయ అధికారులు రవి కుమార్‌నాయుడు, జయరాములు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

యాడికి, మే 8(ఆంధ్రజ్యోతి): అనంతపురం రూరల్ మండలం కురుగుంట గ్రామానికి చెందిన భాస్కర్‌రెడ్డి(33) అనే వ్యక్తి కనిపించలేదని అతడి తండ్రి గురివిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కురుగుంటకు చెందిన భాస్కర్‌రెడ్డి ఏప్రిల్ 28న యాడికి మండలం కొట్టాలపల్లిలో బంధువు ఇంటిలో వివాహ రిసెప్షన్‌కు వచ్చాడని తెలిపారు. రిసెప్షన్ అయిపోయిన తర్వాత నుంచి కనబడకుండా పోయాడని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుత్తి రూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరిడికొండ గ్రామ శివారులోని జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన చంద్రమోహన్ అనే వ్యక్తి తెల్లవారుజామున రోడ్డు దాటుతుండగా కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటన పై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

సజావుగా మండల సర్వసభ్య సమావేశం

గుంతకల్లుటౌన్,మే8(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీపీ మాధవి అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహించారు. సర్పంచులు, ఎంపీటీసీలు గ్రామంలో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వివిధ శాఖల అధికారులు గ్రామ ప్రగతిని చదివి వినిపించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కదిరప్ప, ఎంపీడీఓ, ఈఓఆర్డీ డిప్యూటీ తహసీల్దారు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

తాడిపత్రి, మే8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో మూడురోజులక్రితం గుర్తుతెలియని వృద్ధుడు స్పృహకోల్పోయి పడిపోవడంతో రైల్వే సిబ్బంది అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గురువారం చికిత్స పొందుతూ మృతిచెందినట్లు రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. మృతుడికి దాదాపు 70సంవత్సరాల వయస్సు ఉంటుందన్నారు. అనారోగ్యంతో మృతిచెందినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసి ఉంటే అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో సంప్రదించాలని కోరారు.

గుర్తుతెలియని యాచకుడు..

పట్టణంలోని సీబీరోడ్డు కెనరాబ్యాంక్ సమీపంలో గురువారం గుర్తుతెలియని యాచకుడు మృతిచెందాడని పట్టణ ఎస్ఐ గౌస్‌బాషా తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రేపు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ సంఘం ఎన్నికలు

తాడిపత్రి, మే8(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సంఘం తాడిపత్రి తాలూకా సంఘం ఎన్నికలు ఈనెల 10న నిర్వహించనున్నట్లు జిల్లా ఉద్యోగ సంఘం అధ్యక్షుడు గోపికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎన్నికల్లో పాల్గొనాలని సూచించారు. ఎన్నికలు పట్టణంలోని కర్నూలు వెంచర్ రైతు సేవా కేంద్రం వద్ద నిర్వహిస్తామని తెలిపారు.

పూడికతీత పనుల పరిశీలన

రాయదుర్గం, మే 8(ఆంధ్రజ్యోతి): రాబోవు రోజుల్లో వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పట్టణంలోని ప్రధాన కాలువల్లో పూడికతీత పనులు నిర్వహించినట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ప్రధాన మురికికాలువలో మున్సిపల్ కార్మికులు సిబ్బందితో పూడికతీత పనులను నిర్వహించారు. ముత్రాసికాలనీ, బైపాస్‌రోడ్, పార్వతినగర్ నందు పెద్ద కాలువలలో రాబోవు 10 రోజులలో ప్రధాన కాలువలన్నింటిలో పూడిక తీయించాలన్నారు. కార్యక్రమంలో డీఈ రవిప్రకాష్‌నాయుడు, ఏఈ నరసింహులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర పాల్గొన్నారు.

రాయలసీమను పట్టించుకోని పాలకులు: బీఎస్పీ


మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర సమన్వయకర్త పూర్ణచంద్రరావు

రాయదుర్గం, మే 8(ఆంధ్రజ్యోతి): రాయలసీమలో ఉన్నంత నిరుద్యోగం, నిరక్షరాస్యత, పేదరికం ఇంకెక్కడా లేవని, ఇక్కడి నుంచే చాలా మంది మంత్రులు, ముఖ్యమంత్రులు వచ్చినా.. వారు ఈ ప్రాంత ప్రజలకు చేసింది ఏమి లేదని బీఎస్పీ రాష్ట్ర సమన్వయకర్త, మాజీ డీజీపీ డాక్టర్ జె.పూర్ణచంద్రరావు విమర్శించారు. రాయదుర్గంలో గురువారం నిర్వహించిన బహుజన సంకల్పసభలో ఆయన మాట్లాడారు. దేశంలో వంద కోట్ల మందికి న్యాయం చేయగలిగినది బీఎస్పీ అన్నారు. కులగణన చేయాలన్న డిమాండ్ తీసుకొచ్చాం అన్నారు. నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసి సామాన్యుల గొంతుగా బీఎస్పీ నిలిచేలా చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్, పార్టీ రాయలసీమ ఇన్‌చార్జ్ చిందనూరు నాగరాజు, జిల్లా పార్టీ అధ్యక్షుడు కాసాని నాగరాజు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కె. కృష్ణ, నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

మురుగు ఇలా.. ఉండేది ఎలా..?

దర్గాహొన్నూరులో దుర్గంధం.. పట్టించుకోని అధికారులు


దర్గాహొన్నూరులో రోడ్డుపై పారుతున్న మురుగునీరు

బొమ్మనహాళ్, మే 8(ఆంధ్రజ్యోతి): పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా దర్గాహొన్నూరు పంచాయతీ మారింది. గ్రామంలో సయ్యద్ సర్మాస్ వలి చిస్తీ దర్గా ప్రసిద్ధిగాంచింది. ప్రతి గురువారం, అమావాస్య దర్గాకు వందల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ప్రతి ఏటా ఉరుసు ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. దర్గాహొన్నూరు గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక మురుగునీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. ఫలితంగా దోమలు వృద్ధి చెంది విషజ్వరాలు, శ్వాసకోశ సమస్యలు వస్తున్నాయి. గ్రామంలోని పోతప్ప దేవాలయం అంగన్‌వాడీ సెంటర్ వద్ద డ్రైనేజీ లేకపోవడంతో నీరు చేరి బురదమయంగా మారి అధ్వాన్నంగా ఉంటుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. ఈ రోడ్డులో మురుగునీరు చేరి అపరిశుభ్రత వాతావరణం నెలకొందన్నారు. వీధిలో శుభ్రం చేసి మురుగునీటిని వెళ్లేందుకు డ్రైనేజీలు ఏర్పాటు చేస్తే తప్ప సమస్యకు పరిష్కారం లేదని స్థానికులు అంటున్నారు.

డ్రైనేజీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం: దాస్, ఈఓపీఆర్డీ

డ్రైనేజీ, రోడ్డు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాం. అక్కడ స్థానికుల్లో మార్పు రావడం లేదు. మురుగునీటిని బయటకు వదులుతున్నారు. పలు మార్లు హెచ్చరించినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దోమలు వృద్ధి చెందకుండా ఫాగింగ్ చేయిస్తున్నాం. బ్లీచింగ్ పౌడర్‌ను కూడా చల్లిస్తున్నాం.

ఒక్కరోజులోనే ఎంపీడీఓ రిలీవ్

బ్రహ్మసముద్రం, మే 8(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ అధికారిగా ఉద్యోగంలో చేరిన ఒక్కరోజులోనే రిలీవైన ఘటన చర్చనీయాంశమైంది. ఇక్కడ ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్న ఎంపీడీవో పదవి కోసం పైరవీలు చేస్తూ.. విధుల్లో చేరిన ఎంపీడీవోను ఒక్కరోజులోనే రిలీవ్ అయ్యేలా చేశారని పలువురు చర్చించుకుంటున్నారు. బుధవారం కర్నూలు జిల్లా నుంచి ఎంపీడీవోగా విజయసింహారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఒక్కరోజులోనే రిలీవ్ అయినట్లు విశ్వసనీయ సమాచారం.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవం


వీరబ్రహ్మేంద్రస్వామి రథాన్ని లాగుతున్న భక్తులు

బెళుగుప్ప, మే 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు పీఠాధిపతి ఈశ్వరయ్యస్వామి ఆధ్వర్యంలో ఆరాధన మహోత్సవాలు జరిగాయి. బెళుగుప్పతో పాటు పలు గ్రామాల నుంచి వందలాదిమంది బ్రహ్మయ్య శిష్యులు పాల్గొన్నారు.

ఆర్డీటీని కాపాడుకోవడం అందరి బాధ్యత

బొమ్మనహాళ్, మే 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పేద ప్రజల కోసం పనిచేస్తున్న ఆర్డీటీని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి ఉందని అంబేడ్కర్‌సేన నాయకులు పేర్కొన్నారు. గురువారం రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. సేవ్ ఆర్డీటీ అని నినాదాలు చేశారు. ఫాదర్ ఫెర్రర్ జిల్లాలో ఎందరో పేదలకు అండగా నిలిచారని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ నిలిపివేయడంతో లక్షల మంది ఇబ్బంది పడుతున్నాని అన్నారు. కార్యక్రమంలో నాయకులు దివాకర్, రమేష్, పవన్ కుమార్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.